# ఒకటి ఒకటి కాదు




గణితంలో ఒకటి అంటే ఒకటే. కాని జీవితంలో...?

ఇంటర్వ్యూ ప్రారంభమైంది
"నీ పేరు"?
"చక్రవర్తి"
"ఏ రాజ్యానికి"? నవ్వులు
"మీ నాన్నపేరు"?"సుబ్బారావు గారు"
"ఏం చదివావ్"?చెప్పాడు
"నీ అనుభవం"?
"........"
"అంటే చదువై ఇన్నాళ్ళయినా ఖాళీగానే వున్నావన్న మాట" వెక్కిరింత
"సూర్యుడికి చంద్రుడికి మధ్య దూరం ఎంత"?
చెప్పాడు
"అన్నిటికన్నా లోతైనది ఏది"?
చెప్పాడు
"మనిషి బ్రతకడానికి కావల్సిందేంటి"?
"కోడి గుడ్డుకు ఈకలు ఎందుకు లేవు"?
"చేపలు నీళ్ళల్లోనే ఎందుకుంటాయి"?
"గాడిదకు గుర్రానికి తేడా ఏమిటి"?
"........"
"........"
తలా తోక లేకుండా ప్రశ్నలు అడుగుతూనే వున్నారు,
జవాబులు చెప్తూనే వున్నాడు.

లాస్ట్ క్వశ్చన్ నీకీ వుద్యోగం వస్తుందా? రాదా? తోచిన జవాబు చెప్పాడు

ఇంటర్వ్యూ పూర్తయింది. బైటికొచ్చేశాడు.

"నమస్తే సార్" పళ్ళికలిస్తూ కనపడ్డాడు మునలి గుమస్తా. "ఇలా పక్కకి రండి సార్, మాట్లాడుకుందాం... ఈ కేండిడేట్లని పిలవడం, ఈ ఇంటర్వ్యూలూ ఇదంతా వటి "ఐవాష్" సార్. పోస్టులన్ని ఎప్పుడో ఫిలప్ అయిపోయాయి ఒక్కటి తప్ప. ఓ 'యాభై' మీవి కావనుకుంటే ఆ పోస్టు మీదే సార్" సింపుల్ చెప్పేశాడు.

".........."

"నిజానికి యాభై వేలు చాలా తక్కువ సార్. బంగారు బాతుగుడ్లు పెట్టే ఉద్యోగం సార్"

"......."

"ఏంటిసార్, ఇంకా ఆలోచిస్తారు. రెండురోజుల్లోగా డబ్బుతో రండి. 'ఆర్డర్' పట్టుకు పొండి" మునలి గుమస్తా చెప్పడం పూర్తయిందన్నట్లు చూశాడు.

"ఇంకేం ఆలోచించకండి సార్" వెనుక నుండి మునలి గుమస్తా గొంతు

అవును. అనలు ఆలోచించాల్సిన అవనరమే లేదు తనకి

ఎందుకంటే?

తలక్రిందులుగా తపస్సు చేసినా తనాడబ్బు తేలేడు కాబట్టి.

★ ★ ★

పెళ్ళి చూపులు ప్రారంభమయ్యాయి.

"నీపేరు"

"లక్ష్మి"

"మరి నల్లగా ఉన్నావేం" పెళ్ళికొడుకు జోకు] [?]

"ఏం చదివావ్"?

చెప్పింది

"వంటా, వార్పూ.... పెళ్ళికొడుకు అక్కగారి వంతు

"మా అమ్మాయికి అన్నీ వచ్చండి" అమ్మాయి తల్లి జవాబు. "అడిగింది మిమ్మల్ని కాదు మీఅమ్మాయిని" 'అత్తగారి' హోదాలో పెళ్ళికొడుకు తల్లి.

"నీకు డాన్స్ ఏమైనా వచ్చా"? పెళ్ళికొడుకు కళ్ళల్లో ఏ సినిమా రీలు కదిలిందో?

"వచ్చండి, కూచిపూడి" జవాబు

"వస్తే వచ్చిందిలే గానీ, పూరిమీద పడి గంతులేయడం మా యింటా వంటా లేదు" అక్కగారి అనూయ.

"అమ్మాయ్! ఒక్కసారి అటూ, ఇటూ నడిచి చూపించు" నడిచింది.


కాసేపటికి 'తతంగం' పూర్తయింది. మధ్యవర్తితో ఏదో గునగున లాడి వెళ్ళిపోయారు. పెళ్ళిచూపులకొచ్చిన వాళ్ళు, మధ్య వర్తి ఏం చెబుతా రోనని ఆతృతగా ఎదురు చూస్తున్నాడు అమ్మాయి తండ్రి.

"అదృష్టవంతులండీ! సుబ్బారావుగారు. అమ్మాయి నలుపైనా వాళ్ళకి నచ్చిందట. పోతే మీకు తెలుసుగా అబ్బాయిది గవర్నమెంటు ఉద్యోగం. పోతే ఎలాగూ మీకు ఒక్కతే ఆడపిల్ల కాబట్టి పెళ్ళి ఘనంగానే చేస్తారు కదా. పోతే...." ఆగిపోయాడు మధ్యవర్తి

"పోతే.... అమ్మాయి తండ్రిలో టెన్షన్.

"ఓయాభైవేలు 'లాంఛనం' గా యిస్తే చాలట". విషయం పూర్తయిందన్నట్లు చేతులు దులుపుకున్నాడు మధ్యవర్తి.

"యాభైవేలా"




"అర్ధరాత్రి మీ ఇంట్లోంచి 'దొంగ-దొంగ' అని అరువులు వినిపించాయి, ఏమైనా పోయాయా?" అడిగింది అమల.

"దొంగా లేదు! ఏమీ లేదు! మా ఇరుగు పొరుగు ఎంత మంచివాళ్లో చూద్దామని సరదాగా అరిచాం!" సీరియస్‌గా చూస్తూ అంది సరళ.

మేకా సరోజిని

"బంగారం లాంటి సంబంధం. మీరింకేం ఆలోచించకండి" మధ్యవర్తి వెళ్ళిపోయాడు.

ఆలోచించాల్సిన అవసరమే లేదు. ఎందుకంటే అది తన శక్తికి మించింది కాబట్టి.

★ ★ ★

అశాంతిగా అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు సుబ్బారావు

సంసార జీవితంలో ముప్పై ఏళ్ళు గడచిపోయాయి. ప్రభుత్వ ఉద్యోగిగా పాతికేళ్ళు సర్వీసు పూర్తి చేశాడు. ఉద్యోగంలో చేరిన మొదట్లోనే తనకంటూ వో 'స్వంతగూడు' కావాలని, అది చిన్నదైనా సరేనని తను దాచుకున్న డబ్బును, భార్యనగలు అమ్మగా వచ్చిన సొమ్ముతో కలిపి పట్టుపట్టి, కష్టపడి కట్టుకున్నాడు ఈ ఇల్లు. ఈ ఇల్లంటే ఏదో చెప్పలేని అనుబంధం. తన జీవితంలో ఒక భాగమైపోయింది. కాబట్టే 'ఇదన్నా' మిగిలింది. లేకపోతే గొర్రెతోక బెత్తెడే అన్నట్లు ఎదుగు, బొదుగులేని తన ఉద్యోగానికి వచ్చే జీతపు రాళ్ళతో బతుకు బండిని లాగడమే గగనంగా ఉంది. కొడుక్కి డిగ్రీ రాగానే

## "హమారా 'హమ్'"

ఫోటోగ్రఫీ, ఫిలాటెలీకుమల్లే 'హమ్' రేడియో కూడ ఒక హాబీ.

అమెచ్యూర్ రేడియో అని పిలవబడే ఈ హాబీ సామ్యూల్ మోర్స్ 1840 లో టెలిగ్రాఫ్ యంత్రం ప్రదర్శించినప్పుడే పుట్టింది. ఈ హాబీ ఉన్నవాళ్లు రేడియో తరంగాల ద్వారా మాట్లాడుకుంటారు. అందుకే దీన్ని 'అమెచ్యూర్ రేడియో' అంటారు. ఈ హాబీ కలవాళ్లని 'హమ్' అని ఎందుకు పిలుస్తారో ఖచ్చితంగా తెలియనప్పటికీ, ఈ శబ్దం ముగ్గురు ఇన్వెంటర్ల పేర్ల ముందక్షరాలతో సృష్టించబడిందని చెప్పవచ్చు.

ఆ ముగ్గురూ హెర్జ్, అలెగ్జాండర్ గ్రహంబెల్ మరియు మార్కొని.

శ్రీధర శ్రీరామకృష్ణ

ఉద్యోగం వస్తుందనుకున్నాడు. కూతురికి వయస్సు రాగానే పెళ్ళి ఘడియ వచ్చేసిందనుకున్నాడు.

అనుకున్నది అనుకున్నట్టుగా జరిగితే కాలం గొప్పదన మేముంది?

కొడుక్కి ఏజ్ దాటిపోతోంది. కూతురి ముఖంలో నాజూకు తనం తగ్గిపోతోంది. తను మరో ఐదారేళ్ళలో రిటైరైపోతాడు. లాభంలేదు.

ఏదో ఒకటి చెయ్యాలి.

కానీ ఏం చెయ్యాలి

కొడుక్కి ఉద్యోగం రావాలంటే యాభైవేలు కావాలి. కూతురికి పెళ్ళి కావాలంటే యాభై వేలు కావాలి

ఎలా?

ఎలా?

పోనీ ఇల్లు అమ్మేస్తే?

అతికష్టంమీద యాభైవేలు వస్తాయేమో?

అందువల్ల సమస్యలు తీరతాయా?

కొడుక్కి ఉద్యోగం వస్తే కూతురలాగే మిగిలి పోతుంది. కూతుర్ని అత్తవారింటికి పంపిస్తే కొడుకు భవిష్యత్తు? అసలైన విషయం మరచిపోయాడు తను. ఇల్లు అమ్మేస్తే తల దాచుకోవడానికి మార్గం?

దానికి పరిష్కారం ఉందిగా అద్దె ఇల్లు-!

అయితే అలా ఇల్లు అమ్మగా వచ్చిన డబ్బుతో ఎవరి భవిష్యత్తు నిర్ణయించాలి

కొడుకా? కూతురా?

బొమ్మా? బొరుసా?

అసలు ఏ సమస్యా లేని పరిష్కారం ఏమిటి?

ఏమిటి?

ఏమిటి?

ఆ రాత్రి సుబ్బారావు నిద్రపోలేదు.

★ ★ ★

కాలం తనలో నెల రోజులు కలిపేసుకుంది. ఈ మధ్యలో ఓ రోజు ఓ పేపర్లో ఓ మూల అంతగా ప్రాముఖ్యం లేని ఓ వార్త పడింది. "సుబ్బారావు అనే వ్యక్తి పట్టాలు దాటుతుండగారైలు ఢీకొని అక్కడికక్కడే మరణించాడు. ఆయనకి ఒక భార్య, ఒక కొడుకు, ఒక కూతురు వున్నారు.

★ ★ ★

మరో ఆరు నెలలు గడచి పోయాయి. సర్వీసులో వుండగా మరణించాడు కాబట్టి సుబ్బారావు కొడుకు చక్రవర్తికి అదే ఆఫీసులో ఉద్యోగమొచ్చింది. ఇన్స్యూరెన్స్, పి.ఎఫ్. వగైరా డబ్బుతో సుబ్బారావు కూతురి పెళ్ళి జరిగిపోయింది. ఇల్లు యధాప్రకారం మిగిలిపోయింది. సుబ్బారావు భార్య మాత్రం విధవ రాలయింది. ఏ సమస్యా లేకుండా తన పరిధిలో తన సమస్యలన్నిటినీ తీర్చేసానన్న 'తృప్తి'తో దండ వెనకాల నిలువెత్తు ఫోటోలో నవ్వుతున్నాడు సుబ్బారావు.

★ ★ ★

గణితంలో ఒకటి ఎప్పటికీ ఒకటే. కానీ సుబ్బారావు లాంటి ఒక మామూలు వ్యక్తి జీవితం విలువ ఒక్కొక్కసారి ఒక జీవితం కన్నా చాలా ఎక్కువ. కాదంటారా?

★